'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'సక్సెస్ త్రూ సైలెన్స్' అనే అంశంపై బ్రహ్మకుమారీస్ సంస్థ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ వింగ్, సెక్యూరిటీ సర్వీసెస్ వింగ్ అండ్ ఐటీ వింగ్‌కు ముంబాయి చెందిన బి.కె.క్రీనా ఉపన్యసిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

భూభారతి సదస్సులు.. 81 అర్జీలు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం మండలాల్లో భూభారతి సదస్సులు కొనసాగుతున్నాయి. జిన్నారం మండలంలోని శివనగర్ గ్రామంలో తహశీల్దార్ దేవదాస్ ఆధ్వర్యంలో భూభారతి సదస్సు నిర్వహించారు. రైతుల నుండి 20 అర్జీలు అందినట్లు తెలిపారు. అలాగే గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో తహశీల్దార్ పరమేశం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రైతుల నుండి అధికారులకు 61 అర్జీలు అందాయని తెలిపారు.

విశ్వశాంతి మహాయజ్ఞం

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.బుధవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో గల జగన్నాథ స్వామి దేవాలయంలో నిర్వహించిన విశ్వశాంతి మహాయజ్ఞంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత


భవంతి పైకప్పును కూల్చివేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాల్టీ టౌన్ ప్లానింగ్ అధికారులు కిష్టారెడ్డిపేటలో బుధవారం అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలకు గతంలోనే నోటీసులు ఇచ్చామని, స్పందించని వారిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జి ప్లస్ టూ అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను చేపడుతున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ప్రజలు నేరుగా ఫిర్యాదులు చేయవచ్చన్నారు.కమిషనర్ జ్యోతి రెడ్డి ఆధ్వర్యంలో అక్రమ భవనాలను కూల్చివేశామని ఆయన వివరించారు.

లో ప్రెషర్ సమస్య పరిష్కారానికి కృషి

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని గణేష్ నగర్‌లో మంజీరా వాటర్ లో ప్రెషర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. కాలనీ మహిళలు బుధవారం సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన అధికారులతో మాట్లాడారు. జల మండలి అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, గణేష్ నగర్ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి మండల పరిధిలోని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.81లక్షలను కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డితో కలిసి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చండీహోమం




రాయదుర్గం: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవికి అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చండీ హోమం, రుద్రహోమం, నారాయణ హోమం చేశారు.

చెట్టు.. చదువు..

జీవ వైవిధ్యంతో అలరారుతున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ క్యాంపస్‌లు


ఐఎస్‌బీ గచ్చిబౌలిలోని ప్రధాన భవనం ముందు పచ్చదనం


గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ క్యాంపస్ ప్రధాన భవనానికి వెళ్లే రహదారిలో భారీ చెట్లు

- రెండు క్యాంపస్‌లలో 91,531 పైగా చెట్లు
- రీసైక్లింగ్, వర్షపునీటి ద్వారా 29 శాతం నీటి డిమాండ్ తీర్చడం
- రెండు క్యాంపస్‌లకు 'లీడ్' ప్లాటినమ్ సర్టిఫికెట్
- వ్యాపార నాయకులను అందించడమే కాదు, చక్కటి వాతావరణంలో చదివేలా చేయడం
- ఇదీ ఐఎస్‌బీ హైదరాబాద్, మొహాలి క్యాంపస్‌ల పరిస్థితి

రాయదుర్గం: జీవవైవిధ్యానికి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ క్యాంపస్ ప్రత్యేకతను సాధించాయి. ప్రపంచస్థాయిలో ఐఎస్‌బీ తాజాగా 23వ స్థానం పొందింది. రేపటి వ్యాపారవేత్తలను అందించడం కోసం బోధనతో బాటు ఆహ్లాదపూరితమైన వాతావరణం, జీవవైవిధ్యానికి నిలయాలుగా తయారు చేశారు. పచ్చదనం కూడిన ఆహ్లాద పూరిత వాతావరణం నెలకొల్పడంతో అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. ఐఎస్‌బీని గచ్చిబౌలిలో ప్రధాన క్యాంపస్‌ను, పంజాబ్ రాష్ట్రం మొహలీలో రెండవ క్యాంపస్‌ను కొనసాగిస్తున్నారు. 1999 డిసెంబర్ 20న ఐఎస్‌బీని హైదరాబాద్‌లో ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ప్రధాన క్యాంపస్‌ను హైదరాబాద్‌లో 260 ఎకరాల్లో, రెండవ క్యాంపస్‌ను పంజాబ్ రాష్ట్రంలోని మొహలీలో 70 ఎకరాల్లో నిర్వహిస్తున్నారు.

రెండు క్యాంపస్‌లలో 91,531పైగా చెట్లు

- ఐఎస్‌బీ హైదరాబాద్, మొహలీ క్యాంపస్‌లలో కలిపి ఇప్పటి వరకు మొత్తం 91,531పైగా మొక్కలు నాటరు.
- ఇందులో కొన్ని వృక్షాలుగా మారాయి. పూలు, పండ్ల మొక్కలతో పాటు పచ్చదనాన్ని పెంపొందించారు.
- ప్రతి ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటడం ఆనవాయితీ.అలాగే క్యాంపస్‌కు వచ్చే అతిథులతో ప్రత్యేకంగా మొక్కను నాటిస్తున్నారు.
- ఇక వర్షపునీటిని నిల్వ ఉండేలా చేయడంతో పాటు రీసైక్లింగ్ చేస్తూ మొత్తం 29 శాతం నీటిని వాడుకుంటున్నారు

'లీడ్ ప్లాటినమ్' సర్టిఫికెట్

- ఐఎస్‌బీలోని రెండు క్యాంపస్‌లలో రకరకాల పక్షులకు నిలయంగా మార్చారు.
- అందుకోసం ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్‌లో లీడర్‌షిప్ (ఎల్‌ఈఈడీ) ప్లాటినమ్ సర్టిఫికేషన్ లభించింది
- ఈ సర్టిఫికేషన్ యూఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(యూఎస్‌జీబీసీ) అందించే అత్యున్నత స్థాయి స్థిరత్వ గుర్తింపు.


పచ్చదనం నడుమ గచ్చిబౌలి ఐఎస్‌బీ క్యాంపస్


మొహలిలోని ఐఎస్‌బీ క్యాంపస్ ప్రధాన భవనం


గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ క్యాంపస్‌లో నెమళ్ల సందడి (ఫైల్)

శెట్టి బలిజలకు పూర్తిస్థాయి మద్దతు: ఎమ్మెల్యే


ర్యాలీలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఐదేళ్లుగా రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలలో రాయితీలు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న శెట్టి బలిజలను బీసీ కేటగిరీలో చేర్చేందుకు పూర్తి మద్దతిస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శెట్టి బలిజ కులాన్ని బీసీల్లో చేర్చాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ, తులసివనం నుంచి బీసీ కమిషన్‌కు విన్నవించుకోవడానికి ర్యాలీగా వెళ్తున్న శెట్టి బలిజలకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, రావుల శేషగిరిలతో కలిసి ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీసీయూ సేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పిచ్చెటి మురళీ రామకృష్ణారెడ్డి, వైఎస్‌సీపీ రక్షణ సమితి అధ్యక్షులు చెల్లుబోయిన ఏసుబాబు, గాజుల రామారం శెట్టి బలిజ సంఘం అధ్యక్షులు రాయుడు గణపతి, కొండాపూర్ శెట్టి బలిజ సంఘం అధ్యక్షులు చెల్లుబోయిన హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మూసివేసిన గేట్‌లను తెరిపించండి

భెల్ యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రుల వినతి


భారతినగర్ డివిజన్ పరిధి మ్యాక్ సొసైటీ కాలనీ నుంచి భెల్ టౌన్‌షిప్‌లోకి వచ్చే గేట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్‌లో చదివే విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని పాఠశాలల సమయానికి మూసివేసిన గేట్‌లను తెరిచే విధంగా భెల్ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా గతంలో భద్రతా చర్యల్లో భాగంగా భెల్ యాజమాన్యం కొన్ని నెలల క్రితం భెల్ టౌన్‌షిప్‌లోకి వచ్చే కొన్ని గేట్‌లను మూసివేశారు. ఆ సమయంలో ఇతర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. భెల్ టౌన్‌షిప్‌లోని పలు పాఠశాలల్లో పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరు ఆయా కాలనీల నుంచి టౌన్‌షిప్‌లోకి రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం


లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


తారానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఫ్యాన్లు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు ప్రారంభంకానున్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలో మొత్తం 59 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 43, యూపీఎస్ స్కూళ్ళు 3, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 13 కొనసాగుతున్నాయి. ఇవేకాకుండా పెద్ద సంఖ్యలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. బుధవారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలలను శుభ్రం చేయించడంపై దృష్టి పెట్టారు. ప్రారంభ రోజు నుంచి పూర్తి స్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పూర్తిస్థాయి వసతులు



ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నాం. పాఠశాలలు ఆరంభం నుంచే విద్యార్థులు, పుస్తకాలు, నోటు పుస్తకాలు, డ్రెస్‌లను కూడా అందించాలని ఏర్పాట్లు చేశాం.
-మండల విద్యాధికారి వెంకటయ్య

రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ


తారానగర్ కాలనీలో నిర్మిస్తున్న నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. తారానగర్ కాలనీలోని సాయిబాబా దేవాలయం వద్ద రూ.28.45 కోట్లతో చేపట్టిన నల్లగండ్ల చెరువు అలుగు నుంచి భెల్ కూడలిలోని గ్యాస్ గోడౌన్ వరకు ఉన్న నాలా విస్తరణ పనులలో భాగంగా నిర్మిస్తున్న ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం, ఆర్‌సీసీ బెడ్, సైడ్‌వాల్స్ నిర్మాణం, నాలా విస్తరణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఒకప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఆందోళన చెందేవారని, కానీ నేడు ఆ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ అధికారులు ఏఈ నిఖిల, యుగేంధర్, పవన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ సిటీ ప్లానర్ తులసిరామ్, టీపీఎస్ జీషన్, టీపీఎస్ సంతోష్, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం .... మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సెక్యూరిటీ గార్డు మృతి

గచ్చిబౌలి: నడుచుకుంటూ వెళుతూ హఠాత్తుగా కిందపడి సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన ఓం రానా(46) ఏఐఎం సెక్యూరిటీ సర్వీస్‌లో సెక్యూరిటీ గార్డుగా చేరారు. అమీర్‌పేట్‌లో నివాసం ఉంటూ కొండాపూర్‌లోని సుదర్శన్‌నగర్‌లో సాన్వి ఐరిష్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతూ రాళ్లపై పడ్డాడు. దీంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమీప ప్రాంతాలలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రతి 15 ని.లకు ఏసీ బస్సు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్- 2 డిపో పరిధిలో లింగంపల్లి నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు నూతనంగా నాలుగు పుష్పక్ ఏసీ బస్సులు నడుస్తున్నాయని మియాపూర్-2 డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి- చందానగర్, ఆల్విన్ ఎక్స్ రోడ్డు, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ, గచ్చిబౌలి మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు పుష్పక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఉదయం 5.45 నిమిషాలకు, చివరి బస్సు రాత్రి 8.45ని.లకు బయల్దేరతాయి. అలాగే ప్రతి 25 ని.లకు ఓ బస్సు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అదేవిధంగా మియాపూర్ నుండి ఎయిర్‌పోర్టుకు ప్రతి 15నిలకు బస్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మియాపూర్ నుండి జేఎన్‌టీయూ, శిల్పారామం, హైటెక్‌సిటీ, రాయదుర్గం, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు పుష్పక్ ఏసీ బస్సులు నడపబడుచున్నాయని తెలిపారు. మొదటి బస్సు అర్ధరాత్రి 12.15ని.లకు, చివరి బస్సు రాత్రి 11.45ని.లకు బయల్దేరనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీలో ఆలయాల సందర్శనకు సూపర్ లగ్జరీ బస్సులు

మియాపూర్: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ దేవాలయాల సందర్శనకు ఆర్టీసీ మియాపూర్ -1 డిపో పరిధిలో ప్రతి శని, ఆదివారాల్లో సూపర్ లగ్జరీ బస్సులు నడపబడుతున్నట్లు డిపో మేనేజర్ వి. మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, ద్వారక తిరుమల, అన్నవరం, సింహాచలం, వైజాగ్, అరకు 4 రోజుల్లో దర్శనం చేసుకునే విధంగా సూపర్ లగ్జరీ బస్సులు ప్రత్యేకంగా నడుపుతున్నట్లు తెలిపారు. మియాపూర్ నుండి ఈ బస్సులు శుక్రవారం రాత్రి 8 గంటలకు బయల్దేరి ఆలయాల దర్శనాల అనంతరం సోమవారం రాత్రి 10 గంటలకు మియాపూర్ డిపోకు చేరుకుంటుందని తెలిపారు. 30 మంది కంటే ఎక్కువగా భక్తులు ఉంటే ఏ రోజైనా దేవాలయాల సందర్శనకు పంపుతామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8500309052, 7659029882, 9959226153 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిల్పాహిల్స్ రోడ్ నంబర్ 1,2,3, సన్‌షైన్ అపార్ట్‌మెంట్స్, అపర్ణవిల్లాస్, న్యాక్, ఉదయం 11 గంటల నుంచి 2.30 గంటల గంటల వరకు ఇజ్జత్ నగర్ విలేజ్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఖానామెట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్: బృందావన్ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా.. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సద్గురు అపార్ట్‌మెంట్స్, కోలన్ శ్రీనివాస్ రెడ్డి ప్రాంతం, బృందావనం కాలనీ, హైదర్‌నగర్, మయూరినగర్ పార్క్, అదేవిధంగా 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓల్డేజ్ హోమ్, మయూరినగర్ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రవి చంద్ర తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బాలాజీనగర్, దత్తసాయినగర్, శ్రీరంగపురం కాలనీ, అరబిందో కాలనీ, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు లోటస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: హఫీజ్‌పేట్, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.
- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఏపీజీఓ కాలనీ, వైశాలీనగర్ పూర్తిగా, శారద నగర్ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- హనుమాన్ టెంపుల్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మదీనాగూడ మల్లన్న టెంపుల్, మదీనాగూడ మెయిన్‌రోడ్డు నుంచి ప్రణామ్ హాస్పటల్ వరకు, కృష్ణ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

నల్లగండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హుడా విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నల్లగండ్ల హుడా ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.
- 11 కేవీ లక్ష్మీవిహార్ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లక్ష్మీవిహార్ ఫేజ్- 1,2 డాక్టర్స్ కాలనీ, డిఫెన్స్‌కాలనీ, నవోదయ కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఖాజాగూడ, రాయదుర్గంలో జడ్సీ పర్యటన



రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ, రాయదుర్గం, జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని నర్మదా అపార్ట్‌మెంట్స్ సెల్లార్‌లో గత వర్షాకాలం నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో శాశ్వత పరిష్కారంగా స్టార్మ్ వాటర్ డ్రైన్‌లైన్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జోనల్ కమిషనర్‌కు సూచించారు. ఖాజాగూడలోని చెత్త డంపింగ్ యార్డ్ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, దాన్ని వెంటనే తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. రాయదుర్గం బస్తీలో అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ, వాటర్‌పైప్‌లైన్లు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని జెడ్సీ అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్ఈ శంకర్‌నాయక్, హెచ్ఎం డబ్ల్యూఎస్ డీజీఎం నరేందర్ రెడ్డి, డీఈ విశాలాక్షి, ఎలక్ట్రికల్ డీఈ లక్ష్మీప్రియ, టౌన్‌ప్లానింగ్ అధికారులు రామకృష్ణ, జీషన్, ఎంటమాలజీ ఏఈ తనూజ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన జగదీశ్వర్‌గౌడ్



శేరిలింగంపల్లి: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శేరిలింగపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేయాలని ఆయన సూచించారని జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు.

రోబోటిక్ సర్జరీతో విప్లవాత్మక మార్పులు


మెడికవర్ ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు

మాదాపూర్: యూరాలజీ రంగంలో రోబోటిక్ సర్జరీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని యూరాలజిస్ట్ డాక్టర్ ఏ.వి రవికుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో 6నెలల్లో 500లకు పైగా విజయవంతమైన ఆపరేషన్లు చేసినందుకు గానూ బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీ ..క్యాన్సర్, జనరల్ సర్జరీలు, యూరాలజీ, గైనకాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ వంటి పలు విభాగాలలో తక్కువ నొప్పితో వేగవంతమైన రికవరీ ఉంటుందన్నారు. రోబోటిక్ సర్జరీ యూనిట్ 15 మంది నిపుణులైన సర్జన్ల బృందం విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహించిందన్నారు. ఈ విధానంలో అత్యంత ఖచ్చితత్వం, సంక్లిష్టమైన విధానాలను నిర్వహించడానికి సహాయపడుతుందన్నారు. రోగులకు తక్కువస్రావం, తక్కువ నొప్పి, వేగవంతంగా కోలుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట్ పవన్, డాక్టర్లు కేవి .ప్రసాద్, శరత్‌చంద్రకౌశిక్, రవిచందర్, అజయ్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.